సంపద లేని కేంద్రాలు..!

- నిరుపయోగంగా డంపింగ్ యార్డ్‌లు
- షెడ్డులు అందుబాటులోకి వచ్చినా వినియోగంలోకి రాని వైనం
- వృథాగా రూ.లక్షలు వెచ్చించి, నిర్మించిన కేంద్రాలు
- రైతులకు అందని వర్మి కంపోస్టు ఎరువు



మన్నె సుల్తాన్‌పాలెంలో నిర్మాణం పూర్తయ్యి ప్రారంభించని డంపింగ్ యార్డు

బెల్లంకొండ: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మండలంలో అస్తవ్యస్తంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డ్‌లు నిరుపయోగంగా మారాయి. వీటిని అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నెలకొల్పింది. ప్రతి ఇంటిలో, వీధుల్లో సేకరించిన వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి వాటి నుంచి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేయాలనే ప్రణాళిక రూపొందించింది. తద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు, తయారుచేసిన ఎరువును స్థానిక రైతులకు తక్కువ ధరకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరే విధంగా డంపింగ్ యార్డులను నిర్మించారు. మండలంలోని పలు గ్రామాల్లో డంపింగ్ యార్డ్ కేంద్రాలు నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి వచ్చిన, వినియోగంలో తీసుకురావడంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఒకటి రెండు కేంద్రాల్లో మినహా ఇప్పటివరకు వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు చేయలేదు.

మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలో 10 గ్రామ సచివాలయాలు ఉండగా, 13 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. మూడు గ్రామాల్లో మినహా మిగిలిన పది గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. బెల్లంకొండ, నందిరాజుపాలెం, వన్నాయపాలెం గ్రామాల్లో ఒకసారి మాత్రమే వర్మి కంపోస్టు తయారీ చేసి, నిలిపివేశారు. పాపాయపాలెం, కండిపాడు, గంగిరెడ్డిపాలెం, నాగిరెడ్డిపాలెం, మాచాయపాలెం గ్రామాల్లో తయారీ ప్రక్రియ ఇంత వరకూ చేపట్టలేదు. చంద్రాజుపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో నిర్మాణం పూర్తి అయినప్పటీ ప్రారంభించలేదు. న్యూ చిట్యాల, వెంకటాయపాలెం, ఎమ్మాజీ గూడెం గ్రామాలలో డంపింగ్ యార్డు నిర్మాణాలు చేపట్టలేదు.

నెరవేరని లక్ష్యం

ఒక్కో కేంద్రానికి సగటున రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు నిధులు కేటాయించి నిర్మించారు. ఆదేవిధంగా వర్మీ కంపోస్ట్ తయారీకి ఖరీదైన యంత్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాలలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను ఇంటింటా నేరుగా సేకరించాలి. ఈ చెత్తను కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తగా వేరుచేయాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారు చేయడంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించి సంపద సృష్టించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కాగా నిర్వహణ లోపం వల్ల లక్ష్యం నెరవేరడం లేదు.



వెంకటాయపాలెంలో నిర్మాణం నిలిచిపోయిన సంపద తయారీ కేంద్రం

అసాంఘిక కార్యక్రమాల నిలయాలుగా

మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన డంపింగ్ యార్డులు వినియోగంలోకి రాకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. మద్యపాన ప్రియులు, పేకాట జూదరులు కేంద్రాలను నిలయాలుగా మార్చుకున్నారు. ఖాళీ మద్యం బాటిళ్లు, సిగరెట్ పీకలతో సంపద కేంద్రాలు నిండిపోయాయి. నిర్మాణం పూర్తి అయిన కేంద్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకుని వచ్చి, వర్మి కంపోస్టు ఎరువులను తయారు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలోని మూడు గ్రామాల్లోని డంపింగ్ యార్డ్‌లలో ఒకసారి వర్మి కంపోస్ట్ తయారు చేశారు. గ్రీన్ అంబాసిడర్ల కొరత కారణంగా కేంద్రాల్లో ప్రక్రియ నిలిచిపోయింది. నిర్మాణం పూర్తయిన కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ తయారీ ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తాం. అన్నీ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను నియమించి, చెత్త సేకరణ చేస్తున్నాం.

– బి.వెంకటరెడ్డి, ఈవోపీఆర్డీ, బెల్లంకొండ

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

అచ్చంపేట: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌లో htt pr//-c-oea nd-h-r-a. ni-c.i n వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని, ఫాం 18లో ఆధార్ కార్డు ఆధారంగా వివరాలను పూర్తి చేసి, ఫొటో, డిగ్రీ సర్టిఫికెట్‌ను అప్‌లోడు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ, ఏదైనా డిప్లమా పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. గత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా మళ్లీ ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు.

14 నుంచి పల్లె పండగ గ్రామ సభలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీజే విలియమ్స్ గురువారం తెలిపారు. 14న తొండపి, రుద్రవరం, 15న కుందురువారిపాలెం, గోళ్ళపాడు, 16న ముప్పాళ్ళ, మాదల, 17న ఇరుకుపాలెం, దమ్మాలపాడు, 18న బొల్లవరం, నార్నెపాడు గ్రామాల్లోను, 19న చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు, 20న పలుదేవర్లపాడు, తురకపాలెంలో సభలు జరుగుతాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

వైఎస్సార్ విగ్రహం తొలగించాలని టీడీపీ నేతల ఒత్తిడి

తొలగించాల్సిన అవసరం లేదని తహసీల్దార్ ఆదేశాలు



తహసీల్దార్ మార్కింగ్ చేసిన హద్దురాయి

ఆవులవారిపాలెం(క్రోసూరు): మండలంలోని ఆవులవారిపాలెంలో అమరావతి – బెల్లంకొండ డబుల్ రోడ్డు పనుల్లో భాగంగా సైడు డ్రైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. గ్రామసెంటర్‌లో రోడ్డుహద్దులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాలను తొలగించాలని గ్రామ టీడీపీ నాయకులు తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్ కె.శ్రీనివాసరావు విగ్రహం జోలికిపోకుండా పనులు చేసుకోవాలని ఆదేశించారు. గురువారం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహం తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. నంబూరు శంకరరావు వెంటనే జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ తహసీల్దార్‌ను అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఆవులవారిపాలెం గ్రామానికి చేరుకుని వైఎస్సార్ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం విగ్రహం ఎట్టి పరిస్థితిల్లో తొలిగించాల్సిన అవసరం లేదని, అందుకు సంబంధించిన మార్కింగ్ ఇచ్చి ఆర్అండ్‌బీ అధికారులకు కూడా చెప్పటం జరిగింది. అవసరం ఉంటే వీఆర్వో, వీఆర్వోఏలను పనులు ముగిసే వరకు పర్యవేక్షించేలా ఆదేశిస్తామని తెలిపారు.

నేటితో మద్యం దుకాణాల దరఖాస్తు గడువు ముగింపు



పెదకూరపాడు: మద్యం దుకాణాల దరఖాస్తు గడువు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు ఉందని, ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాసమూర్తి, పెదకూరపాడు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వినతల మేరకు ఈ నెల 11వ తేదీ రాత్రి వరకు గడువు పెంచారని తెలిపారు. ఈ నేపథ్యంలో 11వ తేదీకి బదులుగా 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారు చేస్తారని చెప్పారు. 16 నుంచి కొత్త లైసెన్స్ దారులు దుకాణాలు ప్రారంభించుకోవచ్చని తెలిపారు.

నేటితో దరఖాస్తు గడువు ముగింపు

క్రోసూరు: మద్యం షాపులకు దరఖాస్తు గడువు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ముగుస్తుందని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి.తులసి గురువారం తెలిపారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 129 దరఖాస్తులొచ్చాయన్నారు. వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

19 దుకాణాలకు 210 దరఖాస్తులు

సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలో నోటిఫై చేసిన 19 మద్యం దుకాణాలకు మొత్తం 210 మంది దరఖాస్తు చేశారు. సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో నోటిఫై చేసిన 15 మద్యం దుకాణాలకు ఈ నెల 9 నాటికి 164 దరఖాస్తులు రాగా నకరికల్లు మండలంలో రెండు మద్యం దుకాణాలకు 46 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖాధికారులు తెలిపారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు ఈ నెల 11 రాత్రి 7 గంటలతో సమయం ముగుస్తుందని సీఐ పి.వి జయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 14న ఉదయం 8 గంటల నుంచి నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న టౌన్ హాల్ నందు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ పి.అరుణ్‌బాబు సమక్షంలో లాటరీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించ బడుతుందన్నారు.

చిన్నపాటి వర్షానికి వెలసిన తటాకాలు



పట్టణంలోని పొట్టిశ్రీరాములు పార్క్ ఎదురు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



కోర్టు ఆవరణలో నిలిచిన వర్షపునీరు



కూలిన భారీ వృక్షం

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో గురువారం కురిసిన అకాల వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఉదయం సుమారు 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మూడు విడతలుగా కుండపోత వర్షం కురిసింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో మురుగు పొంగి పొర్లింది. రోడ్లపైకి చేరింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన దోబీఘాట్, నాగన్నకుంట, సుందరయ్య కాలనీ, చేనేత సొసైటీ, గుంటూరు– మాచర్ల ప్రధాన రహదారి పక్కన తాలూకా సెంటర్, కోర్టు ప్రాంగణం, బాలికోన్నత పాఠశాల ప్రాంగణం, పాత కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంతో పాటు పాతబస్టాండ్, పార్క్ ఏరియాలో రోడ్ల పై వర్షపు నీరు చేరి తటాకంలా మారాయి. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద చెట్టు కూలి గేట్ పై పడింది. గేట్ కొంత భాగం దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పంచాయతీ పాలన సమర్థంగా ఉండాలి



ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో ఎంపీపీ, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జై బూన్ బీ

సత్తెనపల్లి: పల్లెలు ఆర్థికంగా పరిపుష్టి కావాలంటే పంచాయతీ పాలన సమర్థంగా ఉండాలని సత్తెనపల్లి ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జై బూన్ బీ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ళ, పాకాలపాడు, పణిదం, కంకణాలపల్లి, .దూళ్ళిపాళ్ల, భృగుబండ, కందులవారిపాలెం, గోగులపాడు గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, ఎంపికైన వార్డు మెంబర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ పాలక వర్గాలకు అన్ని అంశాలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. అప్పుడే గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కచ్చితంగా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా తీసుకున్న శిక్షణ ఉపయోగ పడాలన్నారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో గ్రూప్ ఫోటో దిగారు. విస్తరణ అధికారి అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రతన్ టాటా జీవితం దేశ సేవకు అంకితం

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నివాళులు

పెదకూరపాడు: దేశ పారిశ్రామిక విప్లవానికి నాంది పలికి, కోట్లాది మంది యువతకి స్ఫూర్తి నింపిన రతన్ టాటా జీవితం ఆదర్శప్రాయమని, ఆయన మృతి భారతదేశానికి తీరని లోటు అని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక పురోగతికి రతన్ టాటా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కొన్ని లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఉప్పు నుంచి ఉక్కు వరకు, టీ నుంచి ట్రక్కుల వరకు ఇలా ఎన్నో ఉత్పత్తులను, వ్యాపారాలను నెలకొల్పడంలో టాటా వ్యాపార సామ్రాజ్యం విస్తరించడంలో రతన్ టాటా ప్రధాన భూమిక వహించారన్నారు. తన సంపదను పేద ప్రజల అభ్యున్నతికి టాటా ట్రస్ట్ ద్వారా దానం చేసిన మహనీయుడు రతన్ టాటా అని నంబూరు శంకరరావు పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఒక స్ఫూర్తి కావాలని ఆయన మృతికి నివాళులర్పించారు.

ఎస్సీ, ఎస్టీ రైతులు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి



రైతులకు సూచనలిస్తున్న కో–ఆర్డినేటర్ కోటిరత్నం, ఎంపీడీఓ కాశియ్య

నకరికల్లు: రసాయనిక వ్యవసాయంలో పంటలకు చీడపీడలు ఆశించడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని డీబీఆర్‌సీ ఏరియా కో–ఆర్డినేటర్ బి.కోటిరత్నం అన్నారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహనా సదస్సును స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సభకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.కాశియ్య మాట్లాడుతూ పంటలకు రసాయనిక ఎరువులు వాడడం వలన భూమిలో భూసారం తగ్గి పంటల దిగుబడిపై గణనీయమైన ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు, సంక్షేమపథకాలపై అవగాహన పెంచుకొని వాటిని పొందడం ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో పలుగ్రామాల ఎస్సీ,ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై శ్రద్ధ చూపండి



రోగులను పరీక్షిస్తున్న నేత్రవైద్యాధికారి పీవీడీ శివరామసుబ్బారావు

అమరావతి: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలని మండల నేత్ర వైద్యాధికారి పీవీడీ శివరామసుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని ఎంద్రాయి గ్రామ సచివాలయంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా నేత్ర వైద్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి సమస్యలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. అమరావతి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.లీలాప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం మంది అవగాహనా లోపంతో చూపు కోల్పోతున్నారన్నారు. స్వచ్ఛంధ సేవా సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. నేత్ర వైద్యాధికారి శివరామ సుబ్బారావు మాట్లాడుతూ కళ్లకు ఏదైనా దెబ్బతగిలిన, ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు నాటు వైద్యాన్ని, పసర్లను నమ్మకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అరోగ్యశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

• అదుపులో మూడు ఇసుక లారీలు

క్రోసూరు: అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ఇసుక లారీలను, వాటి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు ఎటువంటి అధికారిక సమాచారం బయటకు రానివ్వడం లేదు.

పాహిమాం... జగన్మాత



క్రోసూరు: దుర్గాదేవిగా వాసవీ అమ్మవారు



నకరికల్లు: దుర్గాదేవిగా అమ్మవారు



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గా పీఠంలో శ్రీదుర్గాదేవి



ముప్పాళ్ళ: నార్నెపాడులో దుర్గాదేవి అలంకరణలో



సత్తెనపల్లి: వడ్డవల్లిలో దుర్గాదేవి



అచ్చంపేట: ధాన్యలక్ష్మిగా సీతాదేవి



సత్తెనపల్లి: మేదర సంఘం శ్రీరామమందిరంలో..



పెద మక్కెనలో దుర్గామాత



సత్తెనపల్లి: శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో దుర్గాదేవికి పూజలు



వెంకటపతి కాలనీలో దుర్గాదేవి



దుర్గాదేవిగా వాసవీ మాత

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. – సత్తెనపల్లి

క్లుప్తంగా

వైభవంగా దేవి నవరాత్రులు

రాజుపాలెం: మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి దేవాలయంలో దేవి నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. పూజారి అనీల్‌కుమార్‌శర్మ వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం వేళల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి

రాజుపాలెం: గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు వార్డు మెంబర్లకు రెండవ రోజుల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఆరోగ్య భద్రతపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ నరసింహారావు, పరిపాలన అధికారి బసవకుమారి పాల్గొన్నారు.

కుంకుమ పూజలో మహిళలు



సత్తెనపల్లి: శరన్నవరాత్రులలో పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మహిళలు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్మశాన స్థలం కోసం తహసీల్దారుకు వినతి



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు బాధితుల పునరావాస కేంద్రమైన న్యూ చిట్యాల గ్రామ పంచాయతీకి శ్మశాన స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగంకు వినతిపత్రం అందజేశారు. ముంపు గ్రామాల నుంచి పునరావాస కేంద్రానికి 14 సంవత్సరాల క్రితం వచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు శ్మశాన స్థలాన్ని కేటాయించలేదని తెలిపారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. మాజీ సర్పంచ్ నూన్సావతు హనుమంతరావు నాయక్, భుక్యా నరసింహ నాయక్, మాజీ జెట్పీటీసీ తులిసానాయక్ పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి



సత్తెనపల్లి: ప్రతి మహిళ రక్షణ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం జొన్నకూటి సమాధానం అన్నారు. ధూళిపాళ్ల గ్రామంలో ఉన్న వెలుగు కార్యాలయంలో మహిళా హక్కుల రక్షణ చట్టాలపై మండల స్థాయిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సదస్సుకు డీబీఆర్సీ ఏరియా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం జొన్నకూటి సమాధానం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటి నుంచి వారికి విద్యాబుద్ధులు నేర్పించే విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని, అభివృద్ధికి ప్రధాన భూమిక పోషించాలన్నారు. డీబీఆర్సీ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీబీఆర్సీ రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మహిళలకు ఉన్న 22 రకాల సెక్షన్ల గురించి తెలియజేశారు. సదస్సులో వెలుగు సీసీలు డి.సతీష్, రామాంజమ్మ, మహిళలు, పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీటిని ఆపండి

అమరావతి: స్థానిక గోపాల్‌నగర్ సీసీ రోడ్డు పైన మురుగునీరు ప్రవహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గోపాల్ నగర్‌లో ఇళ్లలో నుంచి వచ్చే మురుగనీరు, గేదెల విసర్జితాలు సిమెంట్ రోడ్డు మీదకి వదలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై గత సోమవారం స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రజా దర్బార్‌లో విన్నవించినా పంచాయతీ అధికారులు పరిష్కరించలేదన్నారు. రోడ్డుపై కివస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.